# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 29-05-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలో జూన్ 3 నుంచి 5 వరకు మద్యం అమ్మకాలను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.**
2. **లోక్‌సభ ఆరో విడత ఎన్నికల్లో 63.37 శాతం పోలింగ్ నమోదైందని కేంద్రఎన్నికల సంఘం వెల్లడించింది.**
3. **అనంతపురం జెఎన్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈసెట్-2024 ఫలితాలు రేపు విడుదల చేయనున్నట్లు ఈసెట్ ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.**
4. **వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.**

===========================

జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలో జూన్ 3 నుంచి 5 వరకు మద్యం అమ్మకాలను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నిన్న నరసరావుపేటలో ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, కౌంటింగ్ రోజున పల్నాడు జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అన్ని హోటళ్లు, లాడ్జీల వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక పోలీసు అధికారిని నియమించాలని ఆదేశించారు.

--------------------------

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 25వ తేదీన 58 స్థానాలకు జరిగిన ఆరో విడత ఎన్నికల్లో 63.37 శాతం పోలింగ్ నమోదైందని కేంద్రఎన్నికల సంఘం తెలిపింది. ఈ విడతలో మొత్తం 11.13 కోట్ల మందికి గాను 7.05 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించింది. ఇప్పటివరకు జరిగిన ఆరు దశల్లోనూ 87.54 కోట్ల మందిలో 57.77కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొంది.

--------------------------

పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈసెట్-

2024 ఫలితాలు రేపు విడుదల చేయనున్నట్లు ఈసెట్ ఛైర్మన్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న ఈ పరీక్షలు జరగగా రాష్ట్రవ్యాప్తంగా 36 వేల 369 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీఈసెట్ వెబ్‌సైట్‌లో ఫలితాలను వీక్షించవచ్చని పేర్కొన్నారు.

---------------------------

వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా సికింద్రాబాద్, సంబల్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డివిజినల్ రైల్వే మేనేజర్ ఎం. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సంబల్‌పూర్-సికింద్రాబాద్ రైలు జూన్ 3, 10 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదుగా సికింద్రాబాద్ చేరుకొంటుందని తెలిపారు. అలాగే సికింద్రాబాద్ – సంబల్‌పూర్ రైలు జూన్ 4, 11 తేదీల్లో రాత్రి 11గంటల 35 నిమిషాలకి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదుగా సంబల్‌పూర్ చేరుకొంటుందని, ప్రయాణికులు ఈ అవకాశన్ని వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

గర్భస్థ పిండాలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయ పార్వతి తెలిపారు. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే సంబంధిత వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులు, అందుకు ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

కౌంటింగ్ ఏజెంట్లు,అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ ఉదయం చిత్తూరు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కౌంటింగ్ ఏజెంట్లు అభ్యర్థులు సహకరించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు.

---------------------------

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు విశాఖపట్నం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. నిన్న విశాఖపట్నంలో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు ఓట్లు లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ బల్లల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు వంటి అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మొదట పోస్టల్ బ్యాలెట్, తరువాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు ఓట్ల లెక్కింపునకు 104 బల్లలు , పోస్టల్ బ్యాలెట్ల కోసం 18 బల్లలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

---------------------------

విజయవాడ నగర పాలక సంస్థ సరఫరా చేస్తున్న తాగునీరు కారణంగా ఓ వ్యక్తి డయేరియాతో చనిపోయాడని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. విజయవాడలో డయేరియా ప్రబలిందని ప్రచారం జరుగుతున్న మొగల్రాజపురం ప్రాంతాల్లో మంచినీటి సరఫరాను ఆయన పరిశీలించి, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మొగల్రాజపురం ప్రాంతాల్లో తాము పర్యటించి పూర్తిస్థాయిలో పరిశీలించామని ఈ ప్రాంతంలో 16 తాగునీటి నమూనాలను తీసుకుని పరీక్షించామని, ఆ తాగునీటిలో క్లోరిన్ శాతం సరిపడినంతే ఉందని తెలిపారు. తాగునీరు కలుషితమైందని, డయేరియా ప్రబలిందని వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని, స్థానికంగా డయేరియా కేసులు నమోదవలేదని స్పష్టం చేశారు.

---------------------------

భారత సైన్యానికి చెందిన మేజర్ రాధికా సేన్ ఐక్యరాజ్యసమితి మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. శాంతి పరిరక్షకురాలిగా మహిళలు, బాలికల కోసం ఆమె చేసిన సేవలను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ప్రశంసించారు. రేపు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమెకు ఈ అవార్డు అందజేయనున్నామని ఐక్యరాజ్యసమితి అధికారులు తెలిపారు.

---------------------------

ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని శ్రీసత్య సాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయం వద్ద వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రసీదులను చూపించి విత్తనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను సరఫరా చేస్తున్నామని, జిల్లాలో సుమారు లక్ష క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరించారు.

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు కోరారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డితో కలిసి కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్జీఎం కళాశాలలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి వేర్వేరుగా కౌంటింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఏజెంట్ల నియామకాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన జాతీయ పార్టీల అభ్యర్థులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నట్లు చెప్పారు.

---------------------------

కాంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యువకులను రాష్ట్రానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. రాష్ట్రానికి చెందిన వందలాది మంది యువకులు కాంబోడియాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని వీలైనంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఏర్పాట్లు చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

---------------------------

పాన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తీ ఆదాయపు పన్ను చట్టం–1961 ప్రకారం ఈ నెల 31వ తేదీలోపు ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆదాయ పన్ను శాఖ పేర్కొంది. ఆధార్‌తో అనుసంధానంచేయనివారి పాన్ కార్డు ఇప్పటికే నిరుపయోగంగా మారిందని, అలాంటి వారు వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో అనుసంధానం పూర్తి చేసుకోవచ్చని తెలిపింది.

=======================